క్లుప్తంగా

బదిలీలు, పదోన్నతుల్లో తప్పిదాలను సరిచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన తప్పిదాలను సరిచేయాలని.. బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని యూపీఎస్సీ స్టీరింగ్ కమిటీ నాయకులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగు పండిట్‌లో ఇచ్చిన అప్‌గ్రేడ్ పదోన్నతుల్లో ఓ దివ్యాంగ ఉపాధ్యాయురాలికి అన్యాయం జరిగిందన్నారు. పదోన్నతులు రాకుండా చేశారని అన్నారు. సీనియార్టీ లిస్టు తయారీలో కూడా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. స్పౌజ్ నిబంధనలు తుంగలో తొక్కిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయం చేయకపోతే ఉద్యమిస్తామన్నారు.

టేబుల్స్ వితరణ

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు (1984–85 బ్యాచ్)పూర్వ విద్యార్థులు సైన్స్ ల్యాబ్ నిమిత్తం రెండు టేబుల్స్‌ను వితరణ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయులకు అందజేశారు. బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

చిన్నచింతకుంట: విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ మండల కార్యదర్శి జీఎస్ దేవదానం అన్నారు. శుక్రవారం చిన్నవడ్డేమాన్‌కి చెందిన పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు సీతారాంను అరెస్టు చేయడాన్ని ఖండించారు. నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ మేరకు న్యాయం చేయాలని కోరుతుంటే ఇలా అరెస్టులు చేయడం తగదన్నారు.

కార్యదర్శిగా రాఘవేందర్

జడ్చర్ల టౌన్: ఏబీవీపీ జడ్చర్ల నగర కార్యదర్శిగా రాఘవేందర్‌ను నియమించారు. ఈ మేరకు సంస్థ జిల్లా కన్వీనర్ సతీష్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంతో పాటు సమాజం కోసం పనిచేస్తామని తెలిపారు.

చిన్నారికి చేయూత

అడ్డాకుల: తిమ్మాపూర్‌కి చెందిన ఓ చిన్నారికి తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ చేయూతనందించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సలాం ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య ఇటీవల చనిపోయింది. కాగా వారి పాప పౌష్టికాహార లోపంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని ఇటీవల అంగన్‌వాడీ టీచర్ హరిత తహసీల్దార్‌కు వివరించారు. కాగా శుక్రవారం గ్రామసభ నిమిత్తం తిమ్మాపూర్ వచ్చిన ఆయనకు ఆమె చిన్నారిని చూపించారు. ఈ మేరకు చిన్నారికి పౌష్టికాహారం అందించాలని ఆయన కుటుంబీలకు రూ.2వేలు అందజేశారు. తర్వాత కూడా పౌష్టికాహారం అందించేందుకు తానే నగదు పంపిస్తానన్నారు. అదేవిధంగా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులకు ఫోన్ చేసి పాప పరిస్థితిని వివరించి తగిన సాయం చేయాలని కోరారు. పాపను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్‌కు అప్పగించారు.

పీయూలో ఆటల పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులకు క్యారమ్స్, చెస్, బ్యాట్మింటన్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత బహుమతులను ప్రదానం చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

పాలమూరు: హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. ఇచ్చిన హామీలు పూర్తిచేసే వరకు ఉద్యమం ఆగదన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. హామీల అమలు కాకుండా ఎమ్మెల్యేలను పార్టీ చేర్చుకునే అంశంపై దృష్టి పెట్టారన్నారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, ప్రస్తుత పరీక్ష తేదీలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేసే జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందించారు. బీజేవైఎం రాష్ట్ర డాటా సెల్ కన్వీనర్ అరవింద్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేష్, శివ, విష్ణు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

నవాబుపేట: కాంగ్రెస్ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి నిరుద్యోగులకు, రైతులకు అన్యాయం చేసిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం వారు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మండల కేంద్రంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. . అరెస్టయిన వారిలో శ్రీనివాస్, లక్ష్మీనారయణ, యాదయ్య, రమేష్, మల్లేష్, శివ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



నిర్మించారు..వదిలేశారు

పదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని భవనాలు



నిరుపయోగంగా మారిన శ్రీరామకొండ అతిథిగృహం



ప్రారంభానికి నోచుకోని మ్యూజియం భవనం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన కోయిల్‌కొండ ఖిల్లాకోట, మహిమాన్వితమైన శ్రీరామకొండ క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో అప్పటి ప్రభుత్వం పదేళ్ల క్రితం రూ.1.18కోట్లు మంజూరు చేసింది. అయితే నిర్మాణాలు పూర్తయి పదేళ్లు గడిచినా నేటికి ప్రారంభానికి నోచుకోవడంలేదు. రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందిన ఖిల్లాకోటను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 2013 సంవత్సరంలో మ్యూజియం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.33 లక్షల నిధులు మంజూరు చేసింది. పూర్తి చేసి ఇన్నాళ్లైనా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. ఖిల్లా వద్ద ఏర్పాటు చేసిన మ్యూజియంలో చారిత్రక అంశాలకు సంబంధించిన విశేషాలను ఖిల్లా సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం అందుబాటులో ఉంచుతామని పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. ఈ విషయంలో అధికారుల అలసత్వం వహించడం వల్లే భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అదేవిధంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రాల్లో శ్రీరామకొండ ఒకటి. ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు కల్పించాలని రూ.85లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఒక్క అతిథిగృహాన్ని మాత్రమే నిర్మించి వదిలేశారు. శ్రీరామకొండపై పలు అభివృద్ధి పనులు జరుగుతాయన్న ప్రజల కల కూడా నెరవేరలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రూ.కోట్లలో పర్యాటక భవనాలు నిర్మించినా వాటిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ భవనాలను ప్రారంభిస్తే కోయిల్‌కొండ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి. – రాఘవేందర్, కోయిల్‌కొండ

వెంటనే ప్రారంభించాలి



కోయిల్‌కొండ ఖిల్లాకోట దగ్గర మ్యూజియం భవనం, శ్రీరామకొండక్షేత్రం దగ్గర అతిథిగృహాలను నిర్మించినా ఎలాంటి ప్రయోజనం లేదు. భవనాలు పూర్తయి సంవత్సరాలు గడిచిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తేవాలి – యునుస్‌అలీ, కోయిల్‌కొండ

పండుగ సాయన్న చరిత్ర స్ఫూర్తిదాయకం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పండుగ సాయన్న చరిత్ర స్ఫూర్తిదాయకమని ముదిరాజ్‌సంఘం నాయకులు ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్‌ముదిరాజ్‌లు అన్నారు. హన్వాడ పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌పీ వెంకటేశ్ నివాసంలో.. సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 17న సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. సాయన్న ఆశయాల సాధనకు యువత నడుం బిగించాలన్నారు. నాయకులు కృష్ణ ముదిరాజ్, మైత్రియాదయ్య, గోనెలశ్రీనివాసులు, మెట్టుకాడి ప్రభాకర్, పరమేశ్, లక్ష్మీదేవి, కురుమయ్య, నాగరాజు, రాకేష్, సంపత్, శశి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను పున:ప్రతిష్టించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో తీసివేసిన మహనీయుల విగ్రహాలను పున:ప్రతిష్టించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు శుక్రవారం డీసీసీ మీడియాసెల్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ వినతిపత్రం అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్‌చంద్రబోస్, మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్‌టీ రామారావు విగ్రహాలను తీసివేశారని, ఆ విగ్రహాలు ఎక్కడా ఉన్నాయో తెలియదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ ఉన్నారు.

కొనసాగుతున్న వనమహోత్సవం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని గుర్తించిన ప్రాంతాల్లో గుంతలు తవ్వి మొక్కలను విరివిగా నాటుతున్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

డీఐఈఓ కార్యాలయంలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. డీఐఈఓ శ్రీధర్‌సుమన్ మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 జూనియర్ కళాశాలల్లో 2500 మొక్కలను నాటినట్లు ఆయన పేర్కొన్నారు. బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్, సాదిక్ పాల్గొన్నారు.



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు ఇతరసిబ్బంది పాల్గొన్నారు.

గండేడ్: వనమహోత్సవంలో భాగంగా గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో పెరటి మొక్కలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కలీం మాట్లాడుతూ తీసుకున్న మొక్కలను జాగ్రత్తగా పెంచాలన్నారు. జయమ్మ, పాండురంగాచారి, దేవేంద్రమ్మ, రమాదేవి, సరిత పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..!



అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ గ్రామం నుంచి బలీదుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రైతు వేదిక సమీపంలో నిర్మిస్తున్న వంతెన అసంపూర్తిగా మిగిలింది. రెండు గ్రామాల మధ్యన ఉన్న తిమ్మక్క వంపును దాటి బీటీరోడ్డుపై రాకపోకలు సాగించాలి. వర్షాకాలంలో వంపు పారితే రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉండేది. దీంతో ఇక్కడ బీటీ రోడ్డును కొంత మేర తొలగించి చిన్నగా ఉన్న కల్వర్టు వద్ద వంతెన ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం రూ.45లక్షలను మంజూరు చేసింది. వాటితో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను వదిలేశాడు. దీనివల్ల రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పనులు జరిగే చోట రోడ్డు దాటడానికి పక్కన మరో తాత్కాలిక దారి ఏర్పాటు చేశారు. అయితే వర్షం కురిసి వంపు పారితే తాత్కాలిక దారి కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఇదే జరిగితే కన్మనూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్‌ను సంప్రదించగా ఇటీవల పీఆర్ డీఈ అనిల్‌కుమార్‌తో కలిసి నిలిచిపోయిన వంతెన పనులను పరిశీలించినట్లు తెలిపారు. వారం, పది రోజుల్లో నిర్మాణం పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అధికశబ్దం వచ్చే సైలెన్సర్ అమర్చితే క్రిమినల్ కేసులు



మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనాలకు మార్పులు చేసి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కంపెనీ సైలెన్సర్ల స్థానంలో అధిక శబ్దం వచ్చే వాటిని ఏర్పాటు చేసిన వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. వాహనదారుడితో పాటు మెకానిక్‌పై కూడా క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వాహనం సీజ్ చేస్తామన్నారు.

పాలమూరులో 'డ్రై' డే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో శుక్రవారం 'డ్రై డే' నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ విషయమై కరపత్రాలు సైతం అందజేశారు. కాగా ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది ఆయా ఇళ్ల వద్ద ఉన్న డ్రమ్ములను, నల్లాగుంతలను, పాత టైర్లను పరిశీలించి నిల్వ నీటిని తొలగింపజేశారు. పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీలను శుభ్రపరిచి, రసాయనాన్ని స్ప్రే చేశారు. కౌన్సిలర్లు సాదతుల్లా, జాజిమొగ్గ నర్సింహులు, మహమ్మద్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో చండీహోమం

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకుని లోకకల్యాణార్థం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన జరిపించి హోమం చేశారు. అనంతరం అన్నదానం జరిపించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ



జడ్చర్ల టౌన్: మాసశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో గురువారం రాత్రి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. అభిషేకాలు జరిపించి రాత్రి అఖండభజనలు, పారాయణం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి ఆలయంలో పూజలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని గుట్టపై వెలసిన సరస్వతీదేవి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహంతో కొద్దిసేపు ఊరేగింపు తీశారు. అలాగే రాత్రి ఆలయంలో భక్తులతో భజన కార్యక్రమం చేపట్టారు.

ఎస్సెస్సీ టాపర్స్‌కు బహుమతుల ప్రదానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టాపర్స్‌గా నిలిచిన వారికి విలేజ్ ఇన్ పార్ట్‌నర్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. 19 మంది విద్యార్థులకు వీఐపీ సంస్థ తరపున రూ.5వేల నగదు, రూ.20 వేల బ్యాంక్ డిపాజిట్‌లను అందజేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం హాజరై ప్రసంగించారు. సమాజంలో వస్తున్న మార్పులకు కారణం ఉపాధ్యాయులే అన్నారు. వారు తలుచుకుంటే సమజాన్ని మార్చగలరన్నారు. 1992లో తాను ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన క్రమంలో అక్షర కిరణం పేరుతో వయోజన విద్య కోసం కృషి చేశామన్నారు. అప్పుడు కేవలం 23శాతం అక్షరాస్యత ఉండేదన్నారు. వీఐపీ సంస్థ బాలికల విద్య కోసం కృషి చేయడం గొప్ప విషయం అన్నారు. పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ నాగేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు డ్రెయినేజీ మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు వన్‌టౌన్ చౌరస్తాలోని గాంధీరోడ్ హైస్కూల్ ఎదుట డ్రెయినేజీ మరమ్మతు పనులను మున్సిపల్ సిబ్బంది ప్రారంభించారు. కాగా, గతంలో అక్కడి వరద కాల్వపైనే సుందరీకరణ పనులు చేపట్టగా మట్టి పడినా తొలగించలేదు. దీంతో ఇటీవలి వర్షాలకు వరదతో పాటు మురుగు రోడ్డుపైకి వచ్చి అసౌకర్యంగా తయారైంది. ఈ విషయమై 'అధికారుల అవగాహన లోపం.. పట్టణ ప్రజలకు శాపం' శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే పేరుకుపోయిన మట్టిని తొలగించి వరద నీటితో పాటు మురుగు ముందుకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫుట్‌పాత్ పక్క నుంచి సిమెంటు పైపులు వేస్తున్నారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ చర్యలు చేపడుతున్నందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

చదువుతో ఉత్తమ భవిష్యత్

భూత్పూర్: చదువుపై దృష్టి, క్రమశిక్షణలతోనే ఉత్తమ భవిష్యత్‌ను విద్యార్థులు పొందగలుగుతారని కళాజాతా సభ్యులు అన్నారు. శుక్రవారం కర్వెనలో ఎస్పీ ఆదేశాలతో సురక్ష పోలీసు కళాబృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు దృష్టికి వస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల వలలో పడరాదని, వారి మాయ మాటలు నమ్మవద్దని సూచించారు. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ కార్మికులపెండింగ్ లోఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని.. తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇచ్చే జీతమే అతి తక్కువ అంటే అదికూడా నెలల తరబడి రాకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు వివరించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవదానం, సాంబశివుడు, ఐఎఫ్‌టీయూ సహాయ కార్యదర్శి వెంకటేశ్, జిల్లా కోశాధికారి గణేష్, బాలు, కొండన్న, చంద్రన్న, జనార్దన్, కుర్మన్న, వెంకట్రాములు, రిజ్వానా, జరీనా, అంజమ్మ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

నవాబుపేట: ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం మాట్లాడుతూ తాజాగా జరుగుతున్న బదిలీ, ప్రమోషన్ల ప్రక్రియలో భాగంగా పోస్టుల మంజూరు చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

సామాజిక సేవల్లో లయన్స్ క్లబ్ భాగస్వామ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు తమవంతు భాగస్వామ్యం అవుతున్నాయని 320–ఏ పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ (2024–25) సంవత్సరానికిగాను నూతన కార్యవర్గం ప్రమాణా స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కె.ప్రసాద్, కార్యదర్శిగా పి.సుదర్శన్‌యాదవ్, కోశాధికారిగా కె.బుచ్చిబాబు ప్రమాణాస్వీకారం చేశారు. 320–ఏ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు, రీజియన్ చైర్‌పర్సన్ అశోక్‌కుమార్ యాదవ్, జోన్ చైర్మన్ మండ్ల రాములు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో కార్యక్రమాలు

జడ్చర్ల టౌన్: ఊర్కొండ మహాత్మాజ్యోతిబా పులే బాలికల రెసిడెన్షియల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఈ ఏడాది రూ.50లక్షలతో సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు.. రోటరీక్లబ్ ఆఫ్ హైదరబాద్ నార్త్ అధ్యక్షుడు బీవీఆర్ సుశీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రోటరీక్లబ్ 61వ స్థాపన వేడుకల్లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఈ ఏడాది సేవా కార్యక్రమాల గురించి వెల్లడించారు. సేవాకార్యక్రమాల్లో భాగంగా సైకిళ్ల ద్వారా బాలికలకు సాధికారత కల్పించటం, వారి ఆరోగ్యం, పునర్వియోగ న్యాప్‌కిన్లపై అవగాహన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి చేపట్టనున్నట్లు తెలియజేశారు.

విద్యార్థికి ఆర్థికసాయం

జడ్చర్ల టౌన్: కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థి పి.హర్షితకు నెలకు రూ.2 వేల చొప్పున ఆర్థికసాయం అందించేందుకు నాగసాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సావిత్రి ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం హైస్కూల్ ఆవరణలో రూ.2వేలను విద్యార్థికి అందజేశారు. ఏడాదిపాటు సాయం అందిస్తానని ప్రకటించారు. హెచ్‌ఎం యం.శ్రీనివాసులు, లింగంపేట పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత పాల్గొన్నారు.

రేపు 3కే వాకథాన్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్‌ప్రైం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల 7నిమిషాలకు 3కి.మీ వాకథాన్ నిర్వహిస్తున్నట్లు డా.అంకిత్ తెలియజేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితోపాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మున్సిపల్ పాలకవర్గం, ఫ్లెవైక్‌అసోసియేషన్ వారు తదితరుల పాల్గొంటారని వివరించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. డా. రచిత పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



పల్లవి



లలిత

గండేడ్: మాడల్ స్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కొండల్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది పది ఫలితాల్లో సత్తాచాటిన పాఠశాల విద్యార్థులు పల్లవి, లలిత బాసర ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.